




# దిన పత్రిక తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 132 గురువారం 15-05-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


# ఇంజనీర్ల పని.. నేతలు చేయొద్దు..

## అలా చేసిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు

- ప్రపంచంలో మూడేళ్లలో కూలింది ఇదొక్కటే
- రాజకీయ నాయకులు చెప్పినట్లు చేస్తే.. ఇంజనీర్లు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుంది
- ఉద్యోగ నియామకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం
- గ్రూప్-1పై రాజకీయ ప్రేరేపిత పిటిషన్
- త్వరలో గ్రూప్-1, 2, 3 నియామకాలు: సీఎం
- ఏఈ, జేటీవోలకు నియామక పత్రాలు



**హైదరాబాద్, మే 14:** ఇంజనీర్లు తమ పని తాము చేయాలని, ప్రాజెక్టులు కట్టాలనే విధాన నిర్ణయం మాత్రమే ప్రజాప్రతినిధులు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు చేయాల్సిన పనిని.. ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రులు చేయకూడదన్నారు. అలా చేయడం వల్ల వచ్చిన ఫలితమే కాళేశ్వరం ప్రాజెక్టు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్లు పెట్టిన ప్రాజెక్టులకు కనీసం భూభౌతిక పరీక్షలు కూడా చేయలేదని, పెద్దసారు హెలికాప్టర్‌లో పోతూ.. కిందికి చూసి, ఇక్కడొకటి, అక్కడొకటి కట్టమని చెబితే పేపర్‌లో రాసుకొని కాంట్రాక్టర్‌కు ఇచ్చి కట్టించారని ఆరోపించారు. బుధవారం.. కొత్తగా ఎంపికైన 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు, 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారుల (జేటీవోల)కు జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "శ్రీశైలం, శ్రీరాంసాగర్‌లు సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే కట్టారు. ఎన్ని ఉపద్రవాలు, వరదలు వచ్చినా ఆ ప్రాజెక్టులు నిటారుగా నిలబడ్డాయి. 22 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన సాగర్‌కుగానీ, 2009లో సామర్థ్యానికి మించి వరదలు వచ్చినా శ్రీశైలం ప్రాజెక్టుకుగానీ ఏమీ కాలేదు. చెక్కు చెదరకుండా నిలబడ్డాయి. సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్‌ల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. కానీ, కాళేశ్వరంపై సీఎంగా బాధ్యతలు చేపట్టేనాటికి రూ.1.02 లక్షల కోట్లు బిల్లులు చెల్లించగా.. మరో రూ.10 వేల కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా.. 50 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. రూ.1.02 లక్షల కోట్లతో నిర్మించి.. మూడేళ్లలోపే కుప్పకూలిన ప్రాజెక్టు భూప్రపంచంలోనే లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్లు సాగర్, శ్రీశైలం, ఉస్మాన్‌సాగర్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎలా కట్టకూడదో అనేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఉదాహరణ అని పేర్కొన్నారు.

### భావోద్వేగంతో నడిపించారు..

నీళ్లు, నిధులు, నియామకాలను భావోద్వేగంగా మార్చి.. రాజకీయం చేసి, రెండుసార్లు ప్రభుత్వాన్ని నడిపించారని బీఆర్ఎసనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేవలం సాగునీటి ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చుపెట్టారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వాయిదా పడుతూ, నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి కాలేదంటే.. దీనికి కారణాలేంటో శాఖలో చేరే ఇంజనీర్లు ఆలోచన చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన పదేళ్లలో ఏ ప్రాజెక్టూ పూర్తికాలేదని, కానీ.. రూ.2 లక్షల కోట్లు ఖర్చయ్యాయని విమర్శించారు. నిధులు వరదలా పారాయని, అవి ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ఆలోచన చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖను కేటాయించామని, అందుకే ఈ శాఖలో నియామకాల వి షయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు.

# మోదీ అధ్యక్షతన సీసీఎస్ భేటీ



**న్యూఢిల్లీ, మే 14:** ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత సీసీఎస్ భేటీ కావడం ఇదే తొలిసారి. తాజా భద్రతా పరిస్థితులు, దేశ సన్నద్ధతపై సమావేశంలో చర్చించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. కాగా, మహా దళపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాధిపతులు బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. మరోవైపు, భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భద్రతను కేంద్రం మరింత పెంచింది. ఇటీవల జరిపిన సమీక్షలో భాగంగా ఆయనకు ప్రస్తుతం కల్పిస్తున్న జెడ్ కేటగిరీ సెక్యూరిటీలో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను చేర్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా?

## ఈ చర్యలపై రాహుల్ సమాధానం చెప్పాలి: కేటీఆర్



**హైదరాబాద్, మే 14:** అందాల పోటీల కోసం పేదల ఇళ్లు కూలుస్తారా? ఇదేనా ప్రజాపాలన అంటూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అందాల పోటీలో పాల్గొనేవారి పర్యటన కోసం వరంగల్‌లో దారివెంట ఇళ్ల ధ్వంసం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనా విధానంపై, అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదప్రజల జీవితాలు రాక్షస బుల్డోజర్లకింద నలిగిపోవాలా అని ప్రశ్నించారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాగా, ప్రపంచసుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చినవారి కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించడం అభ్యంతరకరమని.. ఇది మొత్తం తెలంగాణ సమాజాన్ని అవమానించినట్లేనని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు.

# టీపీసీసీకి మూడ్రోజుల్లో కొత్త కార్యవర్గం!



**న్యూఢిల్లీ, మే 14:** టీపీసీసీ కొత్త కార్యవర్గ నియామకం ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం రెండు, మూడు రోజుల్లో నూతన కమిటీని ప్రకటించే అవకాశముంది. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. కేసీ నివాసంలో సుమారు గంటసేపు జరిగిన సమావేశంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కమిటీలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు.

# కర్రెగుట్టల్లో 31 మంది మావోయిస్టులు హతం

- ఇప్పటి వరకు 28 మందిని గుర్తించాం..
- కొందరు అగ్రనేతలూ హతమై ఉంటారు!
- నక్సల్స్‌కు లొంగిపోవడం తప్ప దారి లేదు
- సీఆర్‌పీఎఫ్ డీజీ జి.పి.సింగ్,ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ వెల్లడి
- శాంతిని నెలకొల్పుతాం: ప్రధాని
- మార్చి 31 కల్లా నక్సల్స్ రహిత భారత్: షా




**చర్ల, మే 14:** ఛత్తీస్‌గఢ్ –తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టు సమస్య అంతానికి ఇది ఆరంభమన్నారు. బీజాపూర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఆర్‌పీఎఫ్ డీజీ గ్యానేంద్ర ప్రతాప్ (జీపీ)సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్.. కర్రెగుట్టల ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. మావోయిస్టులకు లొంగిపోవడం తప్ప మరో అవకాశం లేదని స్పష్టం చేశారు. కర్రెగుట్టలపై మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో ఏప్రిల్ 21న ఆపరేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో బలగాలు కూంబింగ్ చేశాయని, ఆపరేషన్ సాగిన 21రోజుల్లో 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. అడవుల్లో 450 బీర్ బాంబులు, ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. మొత్తం 31 మంది మావోయిస్టులు చనిపోయారని, ఇప్పటివరకు 28మందిని గుర్తించామని, ఏడుగురి మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని వివరించారు. వీరందరిపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందన్నారు. బలగాల దాడిలో చాలా మంది మావోయిస్టులు మృతి చెందారని, సెర్చ్ ఆపరేషన్‌లో మృతదేహాలు దొరుకుతున్నాయని తెలిపారు. మృతుల్లో చాలా మంది కీలక నేతలూ ఉంటారని పేర్కొన్నారు. గుట్టల్లో 214మావోయిస్టు డంపులు గుర్తించామని, 4 ఆయుధ తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేశామన్నారు. చనిపోయిన మావోయిస్టుల నుంచి అధునాతన మెషిన్‌గన్స్, ఏకే 47, ఇన్సాస్ తుపాకులు లభించాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో 18 మంది జవాన్లు గాయపడ్డారన్నారు. ఆపరేషన్ కగార్ భవిష్యత్తులోనూ కొనసాగుతుందని తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తామన్నారు.

# సీజేఐ జస్టిస్ గవాయ్

## ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు - తొలి బౌద్ధ, రెండో దళిత సీజేఐగా రికార్డు
- 1985లో న్యాయవాదిగా కెరీర్ ఆరంభం - 2003లో హైకోర్టు.. 2019లో సుప్రీం జడ్జిగా..
- ఆర్టికల్ 370 రద్దు, బుల్డోజర్ న్యాయం - తదితర కీలక తీర్పుల్లో భాగస్వామ్యం



**న్యూఢిల్లీ, మే 14:** జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా బుధవారం ప్రమాణం చేశారు. రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ గవాయ్ చేత ఈ మేరకు ప్రమాణం చేయించారు. ప్రమాణం అనంతరం జస్టిస్ గవాయ్ తన తల్లి కమల్‌తాయి గవాయ్‌కి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, జేపీ నడ్డా, అర్జున్‌రాం మేఘ్వాల్, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, విపక్షనేత రాహుల్‌గాంధీ తదితరులు హాజరయ్యారు. 64 ఏళ్ల వయసున్న జస్టిస్ గవాయ్.. ఈ ఏడాది నవంబరు 23 వరకూ సీజేఐ పదవిలో కొనసాగనున్నారు. కాగా, జస్టిస్ గవాయ్ బౌద్ధమతావలంబకులు. తద్వారా దేశ తొలి బౌద్ధ సీజేఐగా నిలిచారు. అంతేకాదు జస్టిస్ బాలకృష్ణన్ తర్వాత సీజేఐ పదవిని చేపట్టిన రెండో దళితవ్యక్తిగా పేరొందారు. జస్టిస్ గవాయ్ మహారాష్ట్రలోని అమరావతికి చెందినవారు. ఆయన తండ్రి ఆర్ఎస్ గవాయ్ సీనియర్ రాజకీయ నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్) పార్టీని స్థాపించి దళిత వర్గాల నేతగా పేరొందారు. 1985లో భూషణ్ రామకృష్ణ గవాయ్ న్యాయవాదిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. 1992–93లో బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 2000లో ప్రభుత్వ ప్లీడర్‌గా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదోన్నతి పొందారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019 మే24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపొందారు. సీజేఐగా మం గళవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా అదే ఏడాది అదేరోజు సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ గత ఆరేళ్లలో దాదా పు 700 ధర్మాసనాల్లో ఉన్నారు. దాదాపు 300 తీర్పులను స్వయంగా రాశారు. పలు కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామి. వాటిలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిన ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేయటానికి సమర్థన, పెద్దనోట్ల రద్దు సబబేనని తీర్పు, ఎన్నికల బాండ్లరద్దు, బుల్డోజర్లతో ప్రభుత్వమే నిందితుల ఇళ్ల ను కూల్చటాన్ని నిలిపివేస్తూ తీర్పు.. ఉన్నాయి. ఇటీ వల అలహాబాద్ హైకోర్టు జడ్జి ఒకరు.. నిందితుడు ఓ మహిళ పైజామా తాడు లాగటం, ఛాతిని తాకటం రేప్ కిందకు రాదంటూ ఇచ్చిన తీర్పును జస్టిస్ గవాయ్ సారథ్యంలోని బెంచ్ నిలిపేసింది. సీజేఐగా ప్రమాణం అనంతరం సుప్రీంకోర్టులో తనను న్యాయవాదులు కలిసిన సందర్భంగా జస్టిస్ గవాయ్.. 'జై భీం' అంటూ వారిని పలకరించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనల స్ఫూర్తితో 'జై భీం' నినాదం రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. కాగా, సీజేఐగా ప్రమాణం చేయటానికి కొన్ని రోజుల ముందు తన నివాసంలో జస్టిస్ గవాయ్ విలేకర్లతో మాట్లాడుతూ.. సీజేఐగా తనకు రాజ్యాంగమే అత్యున్నత ప్రమాణంగా ఉంటుందని స్పష్టం చేశారు. పదవీ విరమణ తర్వాత ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టబోనని చెప్పారు. తాజాగా, రిటైర్డ్ అయిన సీజేఐ సంజీవ్‌ఖన్నా కూడా ఏ పదవీ చేపట్టనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి

## ఆయుధాలు వీడటంపై ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోలేం

### మావోయిస్టు అధికార ప్రతినిధి అభయ్



**హైదరాబాద్, మే14**

ఆపరేషన్ కగార్ పేరిట దారుణ మారణకాండ కొనసాగుతోందని, దీనికి అడ్డుకట్ట వేస్తూ శాంతిచర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఓ లేఖలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ కోరారు. శాంతిచర్చలకు అనుకూల వాతావరణంలో భాగంగా తాము షరతుల్లేని కాల్పుల విరమణకు సన్నద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రకటన జారీ చేశామని గుర్తు చేశారు. శాంతిచర్చల విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, బీఆర్ఎస్ నేత కేసీఆర్ బహిరంగసభలో శాంతిచర్చలు కావాలన్న డిమాండ్‌కు లక్షలాది ప్రజలు ఇచ్చిన స్పందన కేంద్రం గమనించాలని కోరారు. తమ పార్టీ నిర్మాణం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉంటుందని ఆయుధాల వీడటంపై తానొడినే నిర్ణయం తీసుకోలేనని, కేంద్రకమిటీ, కోర్ కమిటీ సమావేశమై చర్చ తర్వాత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వాస్తవ పరిస్థితులు అందుకు అనుగణంగా లేవని కేంద్ర, కోర్ కమిటీసభ్యులు కలవడానికి వీలుగా కాల్పుల విర మణ, శాంతిచర్చల ప్రక్రియ కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు.

# రిజర్వాయర్ పనులపై సమీక్ష

## చెన్నూరు లైనింగ్ పనులు ప్రారంభించాలి - ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. కాంగ్రెస్ ఇంచార్జ్ ఝూన్సీ రెడ్డి



**తొలి సమయం పాలకుర్తి మే 14**

పాలకుర్తి శాసనసభ నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నేతృత్వంలో పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఇర్రిగేషన్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు..సమీక్ష సందర్భంగా చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ల పనులపై తక్షణ సమాచారం కోరుతూ, ప్యాకేజ్ 6 కింద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.చెన్నూరు రిజర్వాయర్ లైనింగ్ పనులు ఇంకా ప్రారంభించకపోవడం బాధాకరం అన్నారు. ప్రజల ఆశలు వృథా కాకుండా ఉండాలంటే పనులు వేగంగా జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒక వారంలోగా చెన్నూరు రిజర్వాయర్ లైనింగ్ పనులు ప్రారం భించాలి. నేను స్వయంగా వచ్చి పరిశీలిస్తాను, అంటూ అధికారులను ఆదేశించారు..పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు స్థానిక ప్రజలకు నీటి సదుపాయాలను కల్పించేందుకు ముఖ్యమైనవని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఝూన్సి రాజేందర్ రెడ్డి గారు పాల్గొని, అభివృద్ధి పనుల పట్ల తన మద్దతును తెలియజేశారు..ఇలాంటి సమీక్షల ద్వారా అధికారులు, కాంట్రాక్టర్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేలా చేయడం, ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు..

# మండల అభివృద్ధి కొమ్మూరి తోనే సాధ్యం

**బచ్చన్నపేట మే14 తొలి సమయం న్యూస్**

ప్రభుత్వ పథకాలు అర్హులకే అందేలా చూడాలి బచ్చన్నపేట మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం మండల ప్రధాన కార్యదర్శి అల్వాల ఎల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలోనే మండల అభివృద్ధి జరుగుతుందని మండల అభివృద్ధికి ప్రభుత్వ ఏర్పాటు తర్వాత సిసి రోడ్లు బిటి రోడ్లు తెచ్చారని అలాగే 10 సంవత్సరాలుగా రాని రేషన్ కార్డులు ప్రభుత్వ ఏర్పాటు తర్వాత వచ్చాయని ఇదంతా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అని వారు పేర్కొన్నారు. ఇంద్రమ్మ ఇండ్లు కేటాయింపులలో పారదర్శకంగా ఇంద్ర మహిళలు పనిచేయాలని అర్హులైన నిరుపేదలకు కచ్చితంగా ఈ పథకం వర్తించేలా చూడాలని మండల సీనియర్ నాయకులు నాయకులు సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అలసత్వానికి చోటు లేదని బంధుప్రీతికి తావివ్వరాదని అర్హులైన వారికి కచ్చితంగా ఈ పథకం అందేలా చూడాలని సీనియర్ నాయకులు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి చేయవలసిన పనులు అలాగే రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా తీసుకోవాల్సిన చర్యల గురించి ముఖ్య నాయకులు, మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు, కార్యకర్తలు, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొని చర్చించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలని ఈ విషయంలో ఎవరి మాటను వినాల్సిన అవసరం లేదని ఇందిరమ్మ కమిటీలకు సూచించారు. కార్యకర్తలు నాయకులు సమిష్టి కృషితో రాబోయే పంచాయతీ ఎన్నికలలో విజయదుందుభి మోగించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో జంగిటి విద్యానాథ్ నల్లగొని బాలకిషన్ గౌడ్, అల్వాల ఎల్లయ్య, కొడవటూరు దేవస్థాన కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి,



కోడూరి మహాత్మ చారి మాజీ సర్పంచులు గిద్దెల రమేష్, మాసపేట రవీందర్ రెడ్డి, మేకల కవిత రాజు, వెంకట్ గౌడ్ దేవస్థానం డైరెక్టర్ కరుణాకర్ రెడ్డి, బడుకోలు శ్రీనివాస్ రెడ్డి, పిన్నింటి బాపురెడ్డి, నారాయణరెడ్డి,భూపాల్, ఆనందం, బాలరాజు, రమేష్, కరుణాకర్ మండల మహిళా నాయకులు వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయానికి తాళం వేసిన డెకరేషన్ కాంట్రాక్టర్ జలగం శంకర్

**తొలి సమయం తొర్రూరు మే 14**



తోరూర్ మున్సిపల్ కార్యాలయం లో కాంట్రాక్ట్ వర్కులు చేయగా గత నాలుగు సంవత్సరాలుగా బిల్లులు ఇవ్వకపోవడంపై ఎన్నిసార్లు తిరిగినా పట్టించు కోకుండా బిల్లులు పెండింగ్ ఉంచడమే అలిసిపోయి ఈరోజు మున్సిపల్ గేటుకు తాళం వేయడం జరిగింది గత 4 సంవత్సరాలుగా మున్సిపాలిటీ లో డెకరేషన్ ,లైటింగ్ ,ప్రభుత్వ కార్యక్రమలకు పనులు చేసిన కాంట్రాక్టర్ శంకర్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన చెంది16 లక్షల పెండింగ్ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసిన శంకర్

## తెలంగాణ నూతన సిఎస్ కె. రామకృష్ణ రావునుని కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రెడ్డి



**తొలి సమయం తొర్రూరు మే 14**

తెలంగాణ రాష్ట్ర కొత్త చీఫ్ సెక్రటరీగా నియమితులైన శ్రీ కె. రామకృష్ణ రావు ని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి కూడా ఉన్నారుఈ సందర్భంగా వారు శ్రీ కె. రామకృష్ణ రావు కి మిఠాయి అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర మరింత విశిష్టంగా ఉండాలని ఆకాంక్షించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి పట్ల తమ ఆశయాలను కూడా వారు తెలియజేశారు. కె. రామకృష్ణ రావు తమకు అందించిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు మరియు అభివృద్ధికి తమ పూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు..

## కురవిలో చెక్ పోస్ట్ ప్రారంభించిన మహబూబాబాద్ రూరల్ సిఐ సర్వయ్య



**తొలి సమయం మహబూబాబాద్ మే 14**

కురవి నుండి మహబూబాబాద్ మరిపెడ బంగ్లా తోరూర్ కు ఎలాంటి నిషేధిత అక్రమ రవాణా జరగకుండా ఉండుటకు కురవిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద కురవి పోలీస్ వారి ఆధ్వర్యం లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కురవి ఎస్ఐ గండ్రాతి సతీష్, పిఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ వెంకన్న, హెచ్ సి జూనీమియా, కానిస్టేబుల్ లు కాశీరం, హరిబాబు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఇల్లందు పట్టణ కమిటీ ఎన్నిక

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఇమామ్ముఖ్య అతిధిగా



**తొలిసమయం, ఇల్లందు.మే 14.**

ఇల్లందు నియోజకవర్గం ఇల్లందు పట్టణం తెలుగుదేశం పార్టీ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఇమామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణ అధ్యక్షునిగా పాలముల బాలకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులుగా దాసరి గోపాలకృష్ణ పట్టణ ప్రధాన కార్యదర్శిగా దేశావత్ శ్రీహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నిక కాబడిన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీకి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. నారా చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీని తెలంగాణలో బలోపేతం అవుతుందని తెలుగుదేశం పార్టీ తెలంగాణలో తిరుగులేని పార్టీగా నిలిచిపోతుందనీ అన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకుపోయి ప్రజా సమస్యలపై తెలుగుదేశం పార్టీ తరపున పోరాటం చేస్తామని అన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝూన్సీ రేడ్డి



**తొలి సమయం రాయపర్తి మే 14**

నేడు రాయపర్తి మండలం,కొండూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల వెంకటయ్య గారి కుమారుడు లింగాల అఖిల్-కళ్యాణి ల వివాహ మహోత్సవ వేడుక వారి స్వగృహంలో జరగగా,ఈ వేడుకల్లో పాల్గొని,నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన..పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝూన్సీ-రాజేందర్ రెడ్డి ఝూన్సీ రెడ్డి వెంట ఈ కార్యక్రమంలో..బ్లాక్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## మాజీ ఎంపీటీసీ పల్లె దేవమ్మ కుటుంబాన్ని పరామర్శ

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తొలి సమయం తొర్రూరు మే 14**

తొర్రూరు మండలం కంటేపాలెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ దేవమ్మ పెద్ద కుమారుడు పల్లె యాకన్న గీత కార్మిడు ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మరణించగా నేడు వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటారని హామీ ఇచ్చిన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు వీరి వెంట తొర్రూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మండల మాజీ జెడ్పిటిసి జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, మండల నాయకులు మయూరి వెంకన్న, గ్రామ మాజీ సర్పంచులు నరేడ్ల శ్రీపాల్ రెడ్డి ,పల్లె సర్వయ్య, లకిడి శ్రీధర్ రెడ్డి,పల్లె యాకన్న (రాజ్), తొర్రూర్ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు యర్రం రాజు, పేరబోయిన ప్రభాకర్, ఎడెల్లి మురళి తదితరులు పాల్గొన్నారు

## ఫర్టిలైజర్ షాపును ప్రారంభించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**తొలి సమయం పాలకుర్తి మే 14**



పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో బత్తిని గోపాల్ కుమారుడు బత్తిని మదన్మోహన్ నూతన శ్రీ సాయిరాం ఫర్టిలైజర్ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి జిల్లా మండల గ్రామ నాయకులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు

## పాలకుర్తి రిజర్వాయర్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


**తొలి సమయం పాలకుర్తి మే 14**



పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లపై సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం,శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి నెరుగు పాలకుర్తి రిజర్వాయర్ వద్దకు వెళ్లి పరిశీలన చేశారు..ఈ సందర్భంగా రిజర్వాయర్‌లో మిగిలి ఉన్న బ్యాలెన్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభానికి ముందే చిన్న చిన్న పనులను ముగించాలనే ఆదేశాలు ఎమ్మెల్యే ఇచ్చారు..రాబోయే వర్షాలకు ముందు రిజర్వాయర్ పనులు పూర్తయితేనే, నీటి నిల్వలు సమర్థంగా వినియోగించుకోవచ్చు. ప్రజలకు మేలు కలగాలంటే ఈ పనుల్లో నిర్లక్ష్యం అస్సలు ఉండకూడదు, అని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అధికారులను ఆదేశించారు..ఈ సమయంలో వారిని స్థానిక నాయకులు, ఇరిగేషన్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు కూడా అనుసరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు..

# పుష్పాలంకరణ పంచకట్టు వేడుకలో పాల్గొన్న

## అఖిల భారత యాదవ మహాసభ ఖమ్మం జిల్లా నాయకులు



**తొలిసమయం, ఇల్లందు.మే, 14.** కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామానికి చెందిన పొదిల నరేష్ యాదవ్ – ఉమా ల కుమార్తె యశ్విత కు జరిగిన పుష్పా లంకరణ, కుమారుడు లోకేష్ కు జరిగిన పంచ కట్టు వేడుకలో ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, యాదవ యువజన జిల్లా అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు పాల్గొని చిరంజీవులను అక్షింతలు వేసి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో యాదవుల అభివృద్ధి గురించి జరిగిన చర్చలో వారు మాట్లాడుతూ ముఖ్యంగా మన యాదవుల మంతా ఐక్యంగా ఉంటే ఎలాంటి సమస్యలైనా పరిష్కరించుకోవచ్చుని, ముఖ్యంగా యాదవులు సాంప్రదాయపరమైన వృత్తినే కాకుండా, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉన్నదని పలికారు. విద్యావంతులు అయితేనే రాజకీయ చైతన్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లి వాగదాని కోటేశ్వరరావు యాదవ్, పల్లెబోయిన రవి, తుప్పతి రవికుమార్, బట్ట ఉమేష్ యాదవ్, రామారావు, రవి, కృష్ణ తదితరులు చిన్నారులని ఆశీర్వదించారు.

# తునికి ఆకు సేకరణలో గాయపడిన వారికీ నష్ట పరిహారం అందించాలి

## ఆదివాసీ హక్కుల పోరాట సమితి "తుడుం దెబ్బ" డిమాండ్

**తొలిసమయం కొత్తగూడ మే 14**
వేసవి కాలం లో ఏజెన్సీ లో రెండో పంటగ భావించే తునికి ఆకు సేకరణలో ఇటీవల గాయపడిన వారికీ 5 లక్షలు నష్ట పరిహారం అందించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి "తుడుం దెబ్బ" డిమాండ్ చేస్తుంది.కొత్తగూడ మండల కేంద్రంలో ఈరోజు "తుడుం దెబ్బ" మండల అధ్యక్షులు పూనేం సందీప్ ఏర్పాటు చేసిన సమావేశానికి "తుడుం దెబ్బ" రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల రాము పాల్గొని మాట్లాడుతూ...ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసులు వేసవి కాలంలో "తునికి ఆకు" సేకరణని రెండవ పంటగా భావిస్తారు.ఇది మే నెలలో తునికి ఆకు సేకరించడం జరుగుతుంది. ఈ ఆకు సేకరించే క్రమంలో వారికి అడవిలో మృగాల నుండి ప్రాణ హాని ఉంటుంది. కావున వారు ఆకు సేకరణ సమయంలో గాయపడటం జరుగుతుంది. ఇటీవల ఉమ్మడి కొత్తగూడ మండల పరిధిలో తునికి ఆకు సేకరణలో భాగంగా కొత్తగూడ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఇద్దరు మహిళలు తునికి చెట్టు ఎక్కి ఆకు కొస్తున్న సమయంలో ప్రమాదవశాస్తూ కిందపడి గాయాలపాలు కావడం జరిగింది. అలాగే గంగారం మండలం కొడిశాల మిట్ట గ్రామంలో ఒక యువకుడికి, మామిడి గూడెం గ్రామ%శీ% లో ఒక మహిళ కు అడవి దున్న ఎదురు పడి తీవ్రంగా గయా పర్చడం జరిగింది.ఆయా యూనిట్ల కాంట్రాక్టర్స్ అలాగే ప్రభుత్వం స్పందించి తునికి ఆకు సేకరణలో గాయపడిన వారికీ ఒక్కొక్కరికి 5 లక్షల రూ /- నష్ట పరిహారం అందించాలని ఈ సందర్భంగ డిమాండ్ చేశారు...కార్యక్రమం లో మల్లెల రాము తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పూనేం సందీప్



తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కొత్తగూడ, మల్లెల సారయ్య ప్రధాన కార్యదర్శి, చుంచ నరేష్, కుంజ సాయి తేజ, కుంజ ముకేష్, కోరం సతీష్, కోరం సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ

**తొలిసమయం, ఇల్లందు.మే, 14.**
ఇల్లందు వాసవి క్లబ్ అధ్యక్షుడు భోనగిరి రవి కిరణ్ గారి జన్మదిన సందర్భంగా నేడు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరియు గర్భిణీ మహిళలకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ, యువజన సంఘం అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సత్య ఒదర్, నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మాట్లాడుతూ భోనగిరి రవి కిరణ్ గారు మరిన్ని పుట్టినరోజులు ఇలాగే జరుపుకోవాలని అదేవిధంగా శ్రీ వాసవి మాత ఆశీస్సులు ఎల్లవేళలా వారిపై వారి కుటుంబ సభ్యులపై ఉండాలని కోరుకున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ఇదేవిధంగా రవి కిరణ్ నిర్వహించాలని కోరారు.



# ఖమ్మంలో పిడమర్తి రవి జన్మదిన వేడుకలు



**తొలిసమయం, ఇల్లందు.మే, 14.** ఖమ్మం నగర పరిది రేవతి సెంటర్లో మాదిగ ఉపకుల సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ పిడిమర్తి రవి జన్మదినం వేడుకలు ఘనంగా జరిగాయి . చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇటికాల లత మాదిగ , జేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జిల్లా విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు ముఖ్య అతిథిగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం పిడమర్తి రవన్నకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మాట్లాడారు . పిడమర్తి రవి మాదిగ ఏబిసిడి వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు చేసిన నాయకుడని ఉద్యమ కేసుల్లో ఉండి జైలు జీవితాలు గడిపిన ఉద్యమ చరిత్ర రవికుందన్నారు . ఏబిసిడి సాధించేవరకు 30 ఏళ్ల పోరాడిన చరిత్ర అయిందన్నారు . తెలంగాణ ఉద్యమంలో ఓయూ విద్యార్థినేతగా అనేక పోరాటాలు చేసిన ఘనత ఆయనది . మచ్చలేని నిస్వార్థ నాయకుడు . ఈ కార్యక్రమంలో ఇటుకల లత , విజయకుమార్ , జంగం వెంకయ్య , కుక్కల కృష్ణ , సంగమ్మ లక్ష్మి , సురేష్ , పుల్లూరు శ్రీను , బిక్షం , ముత్తయ్య , రాములు , కళావతి , పాప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# మహిళల సేవలు వెలకట్టలేనివి

## -జిల్లా సంక్షేమ అధికారి లెనినా

**తొలిసమయం, ఇల్లందు.మే,14.**



లక్ష్మీదేవిపల్లి, మే 14:గృహిణిగా, ఉద్యోగినులు గా మహిళల సేవలు వెలకట్టలేనివని జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి స్వర్ణ లత లెనినా అన్నారు. ఈరోజు లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతి నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఇటీవల పదవీ విరమణ చేసిన సీడీపీఓ కనకదుర్గ, హెడ్ మాస్టర్ మేకల జ్యోతి రాణి,రేగళ్ళ అంగన్వాడీ టీచర్ రమాదేవి లకు ఐసిడిఎస్ లక్ష్మీదేవిపల్లి సెక్టార్ -1 ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డి డబ్ల్యూ ఓ. స్వర్ణ లత లెనినా మాట్లాడుతూ... పదవీ విరమణ చేసిసన్మానం పొందిన ముగ్గురు మహిళా ఉద్యోగుల సేవలు సమాజంలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తాయి అన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకుని కొత్త కరెంట్ మీటర్లు, వైరింగ్,లైట్లు , ఫ్యాన్ల తో కూడిన విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు.పాల్వంచ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సూపర్ వైజర్ కె.రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పద్మ వందన సమర్పణ చేశారు. అంగన్వాడీ టీచర్ లు, ఆయాలు, సిబ్బంది, సన్మాన గ్రహీతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# మే 20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

## ఇల్లందు ఆర్టీసీ డిపో కార్మికులు పాల్గొనాలి

### స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ పిలుపు



**తొలిసమయం, ఇల్లందు.మే, 14.** మే 20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా ఇల్లందు ఆర్టీసీ డిపో జనరల్ బాడీ సిఐటీయు కార్యాలయంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో అధ్యక్షులు ఐ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, ఎస్డబ్ల్యూఎఫ్ ఇల్లందు డిపో కార్యదర్శి జే ఉపేంద్ర చారి లు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ కార్పోరేట్ శక్తులకు ఆకులంగా పనిచేస్తున్నారని,కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని, ముఖ్యంగా 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానే తెచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అందుకోసమే ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందేశంలో తాళ్లూరి కృష్ణ ,డి అంజన్న, ఏ ఉమాదేవి, పీ లక్ష్మణ్ రావు, కే కోటయ్య

# సరస్వతి నది పుష్కరాలు- 2025 పోస్టర్ విడుదల చేసిన మంత్రి సురేఖ



**తొలి సమయం వరంగల్ మే 14**
తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుండి 26- వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాలు కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారిక పోస్టర్ను అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ విడుదల చేశారు.ఈ సందర్భంగా పర్యవరణ పరిరక్షణ ఆవశక్యతని సూచిస్తూ తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారిక పోస్టర్ను మంత్రి ఆవిష్కరించారు.ఈ సందర్భం గా మాట్లాడుతూ, నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్లు (SUP) నిషేదించడం, బట్టలు ఉతకడం, వ్యర్థాలను సరిగ్గా నిర్వహణ నీటి కాలుష్యం నుండి చర్మ వ్యాధులను నివారించడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచడం అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల వాహన కాలుష్యం మరియు రద్దీ తగ్గుతుందని తెలిపారు.మనం సమిష్టి బాధ్యత తీసుకొని మన పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పుష్కరాల పవిత్రతను కాపాడుకో వడానికి చేతులు కలపాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

# విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్ద పీట

## గ్రామీణ ప్రాంత ప్రజల అందుబాటులోకి వైద్య సేవలు




**తొలి సమయం వరంగల్ మే 14**
గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో 20లక్షల వ్యయంతో ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు
చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల, నష్కల్ గ్రామాలలో నూతంగా మంజూరు అయిన ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోజు శంకుస్థాపన చేసుకున్న ఆరోగ్య ఉప కేంద్రాలను 6నెలల్లో పూర్తి చేసి చిన్నపెండ్యాల, నష్కల్ గ్రామాల ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో పని చేస్తున్నామని అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలో ఎస్సీ కాలనీ ప్రధాన రోడ్డును సిసి రోడ్డు మరియు ఆర్ అండ్ బీ రోడ్డు నుండి హెల్త్ సబ్ సెంటర్ వరకు సిసి రోడ్డుకు త్వరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి 55ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇచ్చానని త్వరలో మరిన్ని ఇల్లు మంజూరు ఇస్తానని తెలిపారు. 25ఏళ్ల క్రితం నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడే నష్కల్ గ్రామానికి బీటి రోడ్డు వేసానని అన్నారు. నష్కల్ నుండి ఉప్పుగల్ వరకు బీటి రోడ్డు నిర్మాణం మరియు మధ్యలో వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించానని త్వరలోనే మంజూరు వస్తుందని అన్నారు. అలాగే నష్కల్ ప్రధాన రోడ్డును రామాలయం వరకు రోడ్డు వెడల్పు మరియు సిసి రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులలో ఉందని, కావున ఒక్కొక్కటిగా అన్ని పనులు పూర్తి చేసుకుందామని తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నేను మాట ఇస్తే ఖచ్చితంగా చేస్తానని, ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. దానికి మీ అందరి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి LOC అందజేసిన ఎమ్మెల్యే నాయిని

## ఆపధకాలంలో కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే నాయిని కి కృతజ్ఞతలు తెలిపిన నహీయా ఫిర్దోస్ కుటుంబ సభ్యులు

**తొలి సమయం వరంగల్ మే 14**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మహమ్మద్ అన్వర్ హుస్సేన్ గారి కుమార్తె మొహమ్మద్ నహీయా ఫిర్దోస్ కంటి సమస్యతో బాధపడుతున్న క్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరతో బాధిత కుటుంబానికి రూ. 7,00,000/- ల (ఏడు లక్షలLOC )లి కాపీని అందజేశారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు వైద్య విషయంలో అన్ని విధాలుగా అండగా ఉంటుందని, స్థానిక శాసన సభ్యుడిగా నా దృష్టికి వచ్చిన అనారోగ్య సమస్యల పట్ల నా వంతు సహాయ సహకారం అందించే కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే నాయిని గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసి, తమ కృతజ్ఞత భావాన్ని చాటుకున్నారు.

# భద్రంగా ఉండాలి భవిష్యత్తులో ఎదగాలి

**ఎస్పై కుశ కుమార్**

**విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎస్పై కుశ కుమార్**

**సైబర్ నేరగాల పట్ల నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**విద్యార్థులకు పలు సూచనలు చేసి భవిష్యత్ లో ఎలా ఎదగాలని అంటూ అవగాహన కల్పించారు.**




**తొలిసమయం కొత్తగూడ మే 14**

భద్రంగా ఉండాలి భవిష్యత్తులో ఎదగాలి అని ఎస్పై కుశ కుమార్ అన్నారు.బుధువారం కొత్తగూడ మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర క్రీడా పాఠశాల లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమం లో ముఖ్య అతిధిగా ఎస్పై కుశ కుమార్ పాల్గొని ఈసందర్భంగా ఎస్పై కుశ కుమార్ మాట్లాడుతూ...చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, చక్కటి దినచర్య, మంచి ఆహారం, యోగా, వ్యాయామం, కంప్యూటర్ కోచింగ్, ఇంగ్లిష్, ఇతర భాషలపై శిక్షణ, పుస్తకాలు చదవడం వంటి విషయాలపై విద్యార్థులకు భవిష్యత్ లో ఎలా ఎదగాలని అంటూ అవగాహన కల్పించి ముఖ్యం గా వేసవి సెలవుల్లో ఈతకు వెళ్లొద్దు,బైక్స్ నడపొద్దు,ఆన్ లైన్ గేమ్స్ కి దూరంగా ఉండాలని సైబర్ నేరగాల పట్ల నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్ ఫోన్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు సారయ్య, వార్డెన్ జంపయ్య, కోచ్ లు సుదీర్,దానాజీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం

**హైద్రాబాద్ :**రాజకీయాల్లో నేతల మాటలకు అర్థాలు వేరుగా ఉంటాయో.. లేదో కానీ నేరుగా మాట్లాడిన మాటలకు రాజకీయ నేతలు ఎవరి అర్థాలు వారు తీసుకుంటారు. ఈ విషయాన్ని బీజేపీ నేతలు మరోసారి నిరూపించారు. కేసీఆర్ మాటే తన బాట అని హరీష్ రావు మంగళవారం ప్రకటించారు. పార్టీ మారడమో.. కొత్త పార్టీ పెడతారనో ప్రచారం జరుగుతున్న సమయంలో హరీష్ రావు ఈ వివరణ ఇచ్చారు. ఇలాంటి ప్రచారాలు ఇప్పుడు కాదు.. ఎప్పట్నుంచో జరుగుతున్నాయి. హరీష్ రావు కూడా అదే చెబుతున్నారు ఇందులో కొత్తేం లేదు కానీ.. కొత్తగా బీజేపీ నేతలకు హరీష్ రావు మాటల్లో విలీనం అనే అర్థం వినిపించింది. బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం ముహూర్తం ఖరారు అయిందని స్టేట్ మెంట్ ఇచ్చారు. దానికి ఆధారం ఏమిటంటే హరీష్ రావు మాట్లాడిన మాటలట. కేసీఆర్ బాటలోనే నడుస్తానని హరీష్ రావు చెప్పడమే దానికి నిదర్శనమన్నారు జూన్ రెండో తేదీన లేదా డిసెంబర్ లో విలీనం ఉంటుందని తర్వాత కేసీఆర్ సీఎంగా ప్రమాణం చేస్తారన్నారు. రేవంత్ రెడ్డి మార్పు ఖాయమని చెప్పుకొచ్చారు. అందుకే హరీష్ రావు కేసీఆర్ వెంటనే నడుస్తానని చెబుతున్నాని చెప్పుకొచ్చారు. బీజేపీ నేతల మాటల్లో ఇసుమంత కూడా లాజిక్ లేదు. అయినా ఇదేదో పెద్ద సీక్రెట్ అన్నట్లుగా ప్రెస్మీట్ పెట్టి చెప్పేశారు. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం చేసే దానికి అయితే.. ఇటీవల భారీగా ఖర్చు పెట్టుకుని రజతోత్సవ వేడుకలు నిర్వహించాల్సిన అవసరం ఉండేది. ఇప్పటికిప్పుడు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ ఉందని కూడా అనుకోలేరు. ఇలాంటి సమయంలో పార్టీని విలీనం చేస్తారని బీజేపీ నేతలు మాత్రమే అనుకుంటారు. అనుకోవడమే కాదు.. గొప్ప సీక్రెట్ కనిపెట్టామని మీడియా ముందుకు వచ్చి చెబుతూంటారు కూడా.

## భారత్‌ను రెచ్చగొడుతోన్న పాక్, చైనా !

**హైద్రాబాద్ :** భారత్ – పాక్ మధ్య ఉద్రిక్తతలు ఇంకా పూర్తిస్థాయిలో తగ్గనేలేదు.. మరోవైపు నుంచి చైనా భారత్ ను రెచ్చగొట్టే చర్యలకు దిగింది. దేశ సార్వభౌమత్వంపై దాడి చేసేలా వ్యవహరిస్తోంది. డ్రాగన్ కంత్రీ వైఖరిని తిప్పికొడుతూ భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ తనదే అంటూ మరోసారి చైనా చెప్పుకునే ప్రయత్నం చేసింది. అయితే ఈసారి అరుణాచల్ ప్రదేశ్ కు కొత్త పేరు కూడా పెట్టేసింది. జంగ్నాన్ గా వ్యవహరిస్తూ టిబెట్ దక్షిణ ప్రాంతం అంటూ అరుణాచల్ ప్రదేశ్ ను తన మ్యాప్ లో ప్రదర్శించింది. దీనిపై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ.. పేర్లు మార్చుకున్నంత మాత్రానా.. నిజాలు అబద్ధాలు అవుతాయా? అంటూ చైనాకు కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ పై చాలా కాలంగా భారత్ %-% చైనా మధ్య వివాదం నడుస్తోంది. ఇప్పటికే టిబెట్ ను తనలో కలిపేసుకున్న చైనా.. తన ఫోకస్ ను అరుణాచల్ ప్రదేశ్ పై పెట్టింది. అందులో భాగంగా అప్పుడప్పుడు భారత్ ను రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తోంది. ఎనిమిదేళ్లుగా అరుణాచల్ ప్రదేశ్ లోని పలు ప్రాంతాలకు చైనీస్ లాంగ్వేజ్ లో పేర్లు కూడా పెడుతోంది. 2017లో 6 ప్రదేశాల పేర్లను మార్చింది. దీని తర్వాత, 2021లో 15 ప్రదేశాల పేర్లను మార్చారు. ఆ తరువాత 2023లో 11, 2024లో గరిష్టంగా 30 ప్రదేశాల పేర్లనుమార్చారు. ఇందులో పర్వతాలు, నదులు, సరస్సులు, నివాస ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పుడు అరుణాచల్ ప్రదేశ్ భూభాగాన్ని చైనా ప్రాంతంగా గుర్తిస్తూ మ్యాప్ ను విడుదల చేసింది డ్రాగన్ కంత్రీ. దీనిపై భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అయితే,పాక్ -భారత్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న క్రమంలోనే చైనా ఈ అరుణాచల్ ప్రదేశ్ పై వివాదాస్పదంగా వ్యవహరించడంపై చర్చ జరుగుతోంది.

# జిల్లా సందర్శనకు వచ్చిన వివిధ దేశాల సుందరీమణులకు ఘన స్వాగతం

**వరంగల్ నగర సందర్శనకు వచ్చిన 20దేశాల సుందరీమణులు**



**తొలి సమయం వరంగల్ మే 14**

హనుమకొండ: ఆనాటి కాకతీయ సామ్రాజ్య రాజధాని నగరం, వరంగల్ లోని చారిత్రక వేయి స్తంభాల దేవాలయం, వరంగల్ కోటను సందర్శించేందుకు హెరిటేజ్ వాక్ లో భాగంగా వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు బుధవారం సాయంత్రం హనుమకొండ కు చేరుకున్నారు.హైదరాబాద్ నుండి ప్రత్యేక బస్సు లో విశ్వ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీ మణులు హనుమకొండ లోని టూరిజం హెూటల్ హరిత కాకతీయ కు సాయంత్రం 4:35 గంటలకు చేరుకోగా పూలమాలలు వేసి వారిపై పూలు చల్లి హెూటల్ వద్ద ఘన స్వాగతం పలికారు. సుందరీమణులు జిల్లాకు వచ్చిన సందర్భంగా వరంగల్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులు పుష్ప గుచ్ఛాలను అందజేశారు. హనుమకొండకు చేరుకున్న అర్జెంటీనా, బ్రెజిల్, బొలివియా, కెనడా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్, ఎల్ సాల్వేడార్, గ్వాటేమాల, హైతీ, హెూండూరస్, మెక్సికో, నికరాగ్వా, పరాగ్వే, పనామా, పెరూ, అమెరికా, సూరి నామ్, వెనుజుల, బెలిజ్ దేశాలకు చెందిన సుందరీమణులకు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు, సంప్రదాయ డోలు వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు సుందరీమణులు నృత్యాలు చేశారు.హరిత కాకతీయ నుండి భారతీయ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు వేయి స్తంభాల దేవాలయానికి బయలుదేరారు.హనుమకొండ లోని చారిత్రక వేయి స్తంభాల దేవాలయం వద్ద వివిధ దేశాల సుందరీ మణులకు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికిన మహిళలు.ఆలయ ప్రవేశ మార్గం వద్ద సుందరీమణులకు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికిన వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్, రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీ డబ్ల్యూఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, తదితరులు సాంప్రదాయ చీర కట్టులో ఆలయ సందర్శనకు వచ్చిన వివిధ దేశాల సుందరీమణులుఆలయ ఆవరణలో ఉన్న కోనేరు ను పరిశీలించారు. వేయి స్తంభాల దేవాలయం ప్రాశస్త్యాన్ని వివరించే శిలా శాసనాన్ని పరిశీలించిన సుందరీమణులు. శిలా శాసనంలో ఉన్న ఆలయ చరిత్ర ని వివరించిన గైడ్.అనంతరం సాంప్రదాయ ప్రకారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాంబాలంలో చెంబులో ఉన్న నీళ్లతో వివిధ దేశాల సుందరీమణులు కాళ్లను కడుక్కున్నారు. ఆలయం ఆవరణలో ఉన్న నంది విగ్రహం వద్ద ఫోటో షూట్ లో సుందరీమణులు పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మంటపాన్ని దర్శించారు. అనంతరం ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన సుందరీ మణులు. లేజర్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగులతో ఉన్న ఆలయ పరిసరాలను సుందరీమణులు ఆసక్తిగా తిలకించారు. ఆలయం వద్ద ఫోటోలు దిగారు. ప్రదక్షిణ తరువాత ఆలయంలో రుద్రేశ్వర స్వామి కి అభిషేకం చేసి పూజలు చేసిన సుందరీమణులు. దర్శనం అనంతరం వేద పండితులు సుందరీ మణులకు ఆశీర్వచనాలు అందజేశారు. వేద పండితులు అందించిన తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు వేయి స్తంభాల దేవాలయం సందర్శన అనంతరం వరంగల్ కోటకు సుందరీమణులు బయలుదేరారు.

# కల్నల్ సోఫియా ఖురేషిపై మంత్రి వ్యాఖ్యలు..

## తీవ్రంగా స్పందించిన జాతీయ మహిళా కమిషన్

**మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన జాతీయ మహిళా కమిషన్**

**ఇది మహిళల గౌరవాన్ని, దేశ సేవకురాళ్లను అవమానించడమేనన్న ఛైర్‌పర్సన్**

**పెరుగుతున్న విమర్శలతో దిగొచ్చిన మంత్రి విజయ్ షా, క్షమాపణలు వెల్లడి**



**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా, సైనికాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు మహిళల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని స్పష్టం చేసింది. పెరిగిన వ్యతిరేకత నేపథ్యంలో మంత్రి విజయ్ షా తన వ్యాఖ్యలపై క్షమాపణలు తెలిపారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల సమయంలో మీడియాకు వివరాలు వెల్లడించిన సైనికాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీపై మంత్రి విజయ్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహాట్కర్ ఈ ఘటనపై స్పందిస్తూ, "కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు స్త్రీల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. ఇది మన సమాజంలోని మహిళల గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న మన కుమార్తెలను అవమానించినట్లు అవుతుంది" అని పేర్కొన్నారు. మంత్రి పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు మహిళల పట్ల గౌరవప్రదమైన వైఖరిని అలవర్చుకోవాల్సిన ఆవశ్యకతను విజయ రహాట్కర్ నొక్కిచెప్పారు. "కల్నల్ సోఫియా ఖురేషీ దేశం గర్వించదగ్గ భారత పుత్రిక. దేశాన్ని ప్రేమించే ప్రతి భారతీయుడికి ఆమె సోదరి వంటివారు. ఆమె ఎంతో ధైర్యంతో, అంకితభావంతో దేశానికి సేవ చేస్తున్నారు. అటువంటి మహిళలను చూసి దేశం గర్వపడుతోంది. దేశం ప్రగతి పథంలో పయనించాలంటే మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు వచ్చి నాయకత్వం వహించాలి. మహిళలపై అగౌరవ వ్యాఖ్యలు చేయడం దేశాభివృద్ధిని అడ్డుకోవడమే" అని విజయ రహాట్కర్ సామాజిక మాద్యమం వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి విజయ్ షా ప్రసంగిస్తూ, "వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచేసి వితంతువుల్ని చేశారు. వాళ్ల (ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో మోదీజీ పాక్‌కు పంపించి పాఠం నేర్పించారు" అంటూ కర్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. మంత్రి వ్యాఖ్యలు అత్యంత సిగ్గుచేటుగా, కించపరిచేవిగా ఉన్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. మంత్రి విజయ్ షాను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ నేతలు ప్రధానమంత్రిని డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవడంతో మంత్రి విజయ్ షా వెనక్కి తగ్గారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, "ఉగ్రవాదుల దుశ్చర్యలతో నా మనసు తీవ్రంగా కలత చెందింది. ఆ ఆవేదనలోనే అలాంటి వ్యాఖ్యలు చేశాను. కులమతాలకు అతీతంగా దేశానికి కల్నల్ ఖురేషీ అందిస్తున్న సేవలకు నేను సెల్యూట్ చేస్తున్నాను. ఆమెను కించపరిచే ఆలోచన నాకు కలలో కూడా రాదు. నా మాటలు ఎవరి మనసునైనా నొప్పించి ఉంటే, పదిసార్లు క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని తెలిపారు.

# తెలంగాణ బీజేపీ నేతల టైంపాస్ పాలిటిక్స్ !

**హైద్రాబాద్ :** తెలంగాణ బీజేపీ నేతలు కొంతమంది తమ క్రెడిబులిటి కోల్పోతున్నారు. ఇష్టారీతిన మాట్లాడుతూ స్థాయిని దిగజార్చుకుంటున్నారు. సంచనాలకు కేంద్ర బిందువుగా నిలవాలని ఆరాటమో ఏమో కానీ తరుచుగా ఏదో అంశంపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. వార్తల్లో హైలెట్ అవుతున్నారు కానీ, వారు చెప్పిన మాటలకు కట్టుబడి ఉండకపోవడం, ఆ కామెంట్స్ సత్యదూరమై ఉండటంతో బీజేపీ నేతల వ్యాఖ్యలను అంతా లైట్ తీసుకుంటున్నారు. తాజాగా బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కాంగ్రెస్ లో విలీనం అవుతుందని జోస్యం చెప్పారు. జూన్ రెండో తేదీన లేదా డిసెంబర్ లో విలీనం ఉంటుందని తర్వాత కేసీఆర్ సీఎంగా ప్రమాణం చేస్తారన్నారు.ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మార్పు ఖాయమని చెప్పుకొచ్చారు. ఇందుకు ఆయన చెప్పిన లాజిక్..పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతున్న హరీష్ , కేసీఆర్ వెంట నడుస్తానని ప్రకటించడమేనట. ఇది సిల్లీ లాజిక్ అని ఎవరికైనా అనిపిస్తోంది. ఒక్క ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాత్రమే కాదు..గతంలో లక్ష్మణ్ కూడా తెలంగాణ కాంగ్రెస్ లో ఆగస్ట్ సంక్షోభం తప్పదని బిగ్ బాంబ్ పేల్చారు. ప్రభుత్వం కుప్పకూలుతుందని రేవంత్ సర్కార్ కు వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బీజేపీకి ఉండటంతో ఈ విషయంపై తీవ్ర ప్రకంపనలు రేగాయి. ఆ తర్వాత అలాంటిదెం లేకపోవడంతో అదంతా టైం పాస్ పాలిటిక్స్ లో భాగమని క్లారిటీ వచ్చింది. అలాగే, బీజేపీ ఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డి కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి తారస్థాయికి చేరుకుందని, మంత్రులంతా కుంభకోణంలో బిజీగా ఉన్నారని గతేడాది ఆరోపించారు. ఒక్కొక్క మంత్రి బాగోతం త్వరలోనే బయటపెడుతానని చెప్పారు. కానీ, ఆయన ఏ మంత్రి స్కామ్ వివరాలను బయటపెట్టకపోవడంతో.. సంచలనాల కోసమే బీజేపీ నేతలు ఇలా మాట్లాడుతారని అందరికీ మరోసారి స్పష్టత వచ్చినట్లు అయింది. ఇప్పుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కామెంట్స్ ను తెలంగాణ రాజకీయ పరిశీలకులు కూడా ఆ కోవలో చూస్తున్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101